# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 05.08.2025 | 24 క్యారెట్లు 10,140.00 | కిలో వెండి 1,23,000 | 31 °C | సంపుటి:3 | సంచిక:218

www.vishalabharati.com


## బీఆర్ఎస్ కి బాలరాజు గుడ్ బై



- బీఆర్ఎస్ పార్టీకి తాజాగా మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా
- బాలరాజు రాజీనామా గులాబీ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది
- చడిచప్పుడు చేయకుండా ఆయన పార్టీని వీడటం ఆశ్చర్యం కలిగిస్తోంది
- టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు, మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణలతో భేటి

2 లో

## లోకేష్ పిల్లోడు: కోమటిరెడ్డి



- నారా లోకేష్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాట్ కామెంట్స్
- నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు
- చిన్నపిల్లోడు, అవగాహన లేనివాడు అని విమర్శలు
- బనకచర్లపై లోకేష్ వ్యాఖ్యలు నవ్వు తెప్పిస్తున్నాయి బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చాప్టర్ క్లోజ్ అన్నారు
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌ను "చిన్నపిల్లోడు", "అవగాహన లేనివాడు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. లోకేష్ చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు తనకు ఆసక్తి లేదని.. లోకేష్ అలా మాట్లాడినట్లుగా తెలియగానే తనకు నవ్వు వచ్చిందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో కూడా పోరాడతామని కోమటిరెడ్డి తెలిపారు. నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో కోమిటరెడ్డి మీడియాతో మాట్లాడారు.
బనకచర్ల ప్రాజెక్టు విషయంలో "చాప్టర్ క్లోజ్" అని, దీనిని అడ్డుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన విషయం అందరికీ తెలుసునని, ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ విషయంపై కమిషన్ నివేదిక ఆధారంగా కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కూడా స్పందించారు. తన ఫోన్ నంబర్ ఎప్పటినుంచో ఒకటే ఉందని, దాన్ని మార్చలేదని అన్నారు. ఈ వ్యవహారంలో ఏం జరగాలో అది జరుగుతుందని వ్యాఖ్యానించారు. తన ఫోన్ ట్యాప్ అవలేదని అనుకుంటున్నానన్నారు.
బీఆర్ఎస్ పార్టీలో ఐదు గ్రూపులు ఉన్నాయని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, కవిత, హరీష్ రావు, సంతోష్, కేటీఆర్ గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ పార్టీ భవిష్యత్తులో ఉనికిలో ఉండదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గురించి మాట్లాడడం వృథా అని అన్నారు. కవిత బీసీల గురించి మాట్లాడటంపై విమర్శిస్తూ, గత పదేళ్లలో ఆమెకు బీసీలు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డాననని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా

మిగతా 2 లో



# కాళేశ్వరం అవినీతి @ కర్త, కర్మ, క్రియ కేసీఆరే!

## రాజకీయాలు కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్నాయి

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది
- కేబినెట్ సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు
- త్వరలోనే దీనిపై శాసనసభలో కూలంకషంగా చర్చిస్తామని సీఎం తెలిపారు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు
- కేసీఆర్ అధికారంలోకి వచ్చాక డిజైన్‌ను మార్చి, అత్యధిక వడ్డీకి రుణాలు
- కమిషన్ నివేదిక ప్రజాధనం దుర్వినియోగం అయిందని స్పష్టం చేస్తోందన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్నాయి. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజా ప్రతినిధులందరికీ కమిషన్ నివేదికను అందిస్తామని.. త్వరలోనే దీనిపై శాసనసభలో కూలంకషంగా చర్చిస్తామని సీఎం తెలిపారు. ఇది ఏ రాజకీయ పార్టీ లేదా ప్రభుత్వం ఇచ్చిన నివేదిక కాదని, నిపుణుల కమిటీ సమర్పించిన సమగ్ర నివేదిక అని స్పష్టం చేస్తూ, దీనిపై ఎవరు ఎలా స్పందిస్తారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని అధికార కాంగ్రెస్ బలంగా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా.. మేడిగడ్డ బ్యారేజ్ కేవలం మూడేళ్లలోనే కుంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అంతేకాకుండా.. అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్‌లలో సైతం పగుళ్లు వచ్చాయని పేర్కొన్నారు. రీడిజైనింగ్ పేరుతో అప్పటి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాజెక్టు డిజైన్‌ను ఇష్టానుసారంగా మార్చారని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఇచ్చిన నివేదికగా భావించవద్దని స్పష్టం చేశారు. ఇది ఒక స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ సమర్పించిన నివేదిక అని.. ఇందులో ఎటువంటి రాజకీయ ఆరోపణలు లేవని ఆయన చెప్పారు. కమిషన్ అందరితో మాట్లాడి.. వాస్తవాలను సేకరించి ఈ నివేదికను రూపొందించిందని తెలిపారు.

2 లో

## ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత

### ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్షకు దిగారు

- బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలన్నారు
- గతంలో బీసీల హక్కుల కోసం అనేక శాంతియుత పోరాటాలు
- ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను ప్రత్యేకంగా ఇవ్వాలి
- బీసీ, ముస్లిం రిజర్వేషన్లు వేర్వేరుగా ఉండాలన్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు

2 లో



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదిక పైన ప్రస్తుతం జరుగుతున్న మంత్రివర్గ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ సమయంలోనే పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. కమిటీ నివేదిక పైన చర్చించారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందనే కోణంలో వివరించారు. అరెస్ట్ అంశాన్ని ప్రస్తావించారు. పార్టీ నేతలకు కీలక దిశా నిర్దేశం చేసారు.



## అరెస్ట్ చేయొచ్చు.. కేసీఆర్

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు
- కాళేశ్వరంపై కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చించారు
- ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందనే కోణంలో వివరించారు
- కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని అభివర్ణించారు
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు

2 లో

## రేవంత్ పై రెచ్చిపోయిన కోమటిరెడ్డి బ్రదర్..!

- రేవంత్ రెడ్డి డిజిటల్ మీడియా జర్నలిస్టులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు
- దీనిపై పలు చోట్ల జర్నలిస్టులు నిరసనలు తెలుపుతున్నారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి విమర్శలకు దిగారు
- ఎక్స్ లో స్పందిస్తూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ పోస్టు పెట్టారు
- సోషల్ మీడియా మొదట్నుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉందని తెలిపారు
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నట్లు వెల్లడించారు

2 లో



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం
05.08.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ




**డోర్నకల్, విశాలభారతి:**
టిడబ్ల్యూజేఏ ద్వితీయ మహబూబాద్ జిల్లా మహాసభ కరపత్రాన్ని మరిపెడ తహసిల్దార్ కృష్ణవేణి ఆవిష్కరించారు అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా వెలిగితే జర్నలిజం అని జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలికి తీసి ప్రభుత్వానికి చేరవేసే దాంట్లో జర్నలిస్టుల పాత్ర కీలకమైందిన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్ చంద్ర గౌడ్, మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీ కుమార్, మరిపెడ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బానోతు ప్రవీణ్ నాయక్, బోడ శ్రీను నాయక్ గుగులోతు రాజు నాయక్ హేమ నాయక్ పాల్గొన్నారు.

# ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ జాగృతి గతంలో బీసీల హక్కుల కోసం అనేక శాంతియుత పోరాటాలు చేసింది. ఈ దీక్ష ద్వారా, బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించాలని, సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీ జనాభాకు న్యాయం చేయాలని కవిత ఒత్తిడి చేస్తున్నారు.
కవిత మాట్లాడుతూ, ముస్లిం రిజర్వేషన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. "ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను ప్రత్యేకంగా ఇవ్వాలని కోరుతున్నాం. బీసీ, ముస్లిం రిజర్వేషన్లు వేర్వేరుగా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. బీజేపీ కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ సంతకం చేయకపోతే, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తాం" అని ఆమె హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్ల చుట్టూ చర్చను మరింత తీవ్రతరం చేశాయి.
కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో కాంట్రాక్టుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఈ హామీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదు. బీజేపీ నాయకులు ఈ రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ, దీనిని మతపరమైన రిజర్వేషన్‌గా అభివర్ణిస్తున్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లాంటి నాయకులు ముస్లిం కోటాను తొలగించి, 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.
మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీపై ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆరోపిస్తూ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, అక్కడ వాటిని రద్దు చేయమని సవాల్ విసిరారు. తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం సహా అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినప్పటికీ, ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది. ఈ ఆలస్యానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం కారణమని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

## కాళేశ్వరం అవినీతి @ కర్త, కర్మ, క్రియ కేసీఆరే!

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముందుగా తుమ్మడిహట్టి దగ్గర కేవలం రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు నీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారని.. కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చాక డిజైన్‌ను మార్చి, అత్యధిక వడ్డీకి ఎన్‌బీఎఫ్‌సీల దగ్గర రూ.84 వేల కోట్ల రుణాలు తెచ్చి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాకముందే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ) నివేదిక కూడా స్పష్టం చేసిందని ఉత్తమ్ వివరించారు. కమిషన్ నివేదిక ప్రజాధనం దుర్వినియోగం అయిందని స్పష్టం చేస్తోందన్నారు.
ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ 605 పేజీలతో కూడిన నివేదికను సమర్పించగా.. దానిపై ఏర్పాటైన ముగ్గురు ఉన్నతాధికారుల కమిటీ దానిని 25 పేజీలకు కుదించి కేబినెట్ ముందు ఉంచింది. ఈ రెండు నివేదికల్లోనూ మాజీ సీఎం కేసీఆర్ పేరు అత్యధిక సార్లు ప్రస్తావించబడినట్లు తెలుస్తోంది. ఘోష్ కమిషన్ నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.
కాళేశ్వరం నిర్మాణం.. నిర్వహణలో జరిగిన అవకతవకలు అన్నింటికీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆరే బాధ్యుడు, జవాబుదారీ అని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనలను విస్మరించి, సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారని కమిషన్ తన నివేదికలో హైలైట్ చేసింది. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేసీఆర్ వ్యవహరించారని కూడా నివేదికలో పేర్కొనడం గమనార్హం.



ఈ నేపథ్యంలో.. బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. మాజీ మంత్రి హరీష్‌రావు.. మంగళవారం మధ్యాహ్నం 12:00 గంటలకు తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ ప్రజెంటేషన్‌ను అన్ని నియోజకవర్గాల్లోనూ బహిరంగంగా ప్రదర్శించాలని పార్టీ ఆదేశించింది.
'ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అంతా కేసీఆరే' అంటూ సాగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. హరీష్‌రావు ప్రజెంటేషన్ బీఆర్ఎస్ పరువును నిలబెడుతుందా లేదా అనేది ఆసక్తిగా మారింది.
ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టుపై సమర్పించిన కమిషన్ నివేదికను తెలంగాణ మంత్రి మండలి ఆమోదించిన నేపథ్యంలో.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. ఈ నివేదిక ఊహించిందేనని.. తమ పార్టీ నాయకులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. 'కొంతమంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు... ఎవరూ భయపడొద్దు, అందరూ ధైర్యంగా ఉండండి' అని కేసీఆర్ తన శ్రేణులకు పిలుపునిచ్చారు.

# రేవంత్ పై రెచ్చిపోయిన కోమటిరెడ్డి బ్రదర్..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా జర్నలిస్టులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పలు చోట్ల జర్నలిస్టులు నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి రాకపోవడంతో అసంతృప్తిగా ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి సీఎం రేవంత్ పై విమర్శలకు దిగారు.
తాజాగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియాపై రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ లో స్పందిస్తూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ పోస్టు పెట్టారు. ఇందులో ఆయన ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలే తప్ప అవమానించడం సబబు కాదన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదట్నుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉందని తెలిపారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.
అలాగే సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికీ విభజించి పాలించడమే అంటూ రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదన్నారు. తద్వారా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నట్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పకనే చెప్పేశారు. ఇప్పటికే మంత్రివర్గ విస్తరణ తర్వాత రేవంత్ పై విమర్శలకు దిగుతున్న రాజగోపాల్ రెడ్డి తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.
ఒకప్పుడు పత్రికలు, ప్రసార సాధనాలంటే ప్రజలకు విశ్వసనీయత ఉండేదని, ప్రస్తుతం జర్నలిస్టు విలువలు పూర్తిగా తగ్గిపోయాయని, ఓనమాలు రాని వాళ్లు, కాగితం ఇస్తే అక్షరాలు రాయడం రాని వాళ్లు జర్నలిస్టులుగా చలామణీ అవుతూ జర్నలిజాన్ని నిర్వీర్యం చేస్తున్నారని రేవంత్ ఈ మధ్య వ్యాఖ్యానించారు. ఎవడు పడితే వాడు జర్నలిస్టు అంటూ తమ రాతలతో, చేతలతో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఆవారాగా రోడ్ల మీద తిరిగే వాళ్లు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులమంటూ తమ అసభ్యకరమైన భాషతో జర్నలిజం వ్యవస్థను నిర్వీర్యం చేసి, విశ్వసనీయత దెబ్బ తీసేలా ప్రవర్తిస్తున్నారని, మీడియా సమావేశాల్లో కొందరు కాలు మీద కాలు వేసుకుని కూర్చొని 'సీనియర్ జర్నలిస్టులకు గౌరవం ఇవ్వవా? నమస్తే పెట్టవా?' అన్నట్టు తమ వైపు చూస్తుంటారన్నారు. అలాంటి వారిని వేదిక దిగి కొట్టాలనిపిస్తోందన్నారు.

# లోకేష్ పిల్లోడు: కోమటిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమేనని.. జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఢిల్లీ వెళ్లి మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నీ కలుస్తున్నానని.. గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఫోర్త్ సిటీ కలపాలని సీఎం చెప్పారన్నారు. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి రిప్రజెంటేషన్ ఇవ్వబోతున్నామన్నారు.
డిండి ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల లైనింగ్ ఏడాదిలో పూర్తి చేస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద 100 ఎకరాలు ఉన్నవారికి కూడా సాయం అందించామని చెప్పారు.
ఎంజీ యూనివర్సిటీలో కొత్త భవనాల నిర్మాణం, నార్కెట్‌పల్లి పెద్ద చెరువును వేణుగోపాలస్వామి పేరుతో మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం, క్యాంపు కార్యాలయానికి "ఇందిరా భవన్"గా నామకరణం చేశామన్నారు.

# అరెస్ట్ చేయొచ్చు.. కేసీఆర్

**కేబినెట్ నిర్ణయం..**
కాళేశ్వరం నివేదిక ప్రధాన అజెండాగా తెలంగాణ మంత్రివర్గం భేటీ అయింది. ఇప్పటికే కమిషన్ ఇచ్చిన నివేదిక పైన అధికారుల టీం కేబినెట్ కు 10 పేజీల నోట్ సిద్ధం చేసింది. అందులో కమిషన్ ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు.. నాటి ప్రభుత్వం ఉమ్మడిగా కాకుండా.. కేసీఆర్ ఈ ప్రాజెక్టు విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని వివరించినట్లు తెలుస్తోంది. కేసీఆర్ తో పాటుగా హరీష్, ఈటలతో సహా పలువురి అధికారుల ప్రస్తావన చేసినట్లు సమాచారం. కాగా, ఇదే నివేదిక పైన భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. మంత్రుల సందేహాలకు సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ మంత్రాంగం...**
అయితే, కేబినెట్ ఈ వ్యవహారం పైన డీజీ స్థాయి అధికారితో విచారణ కోసం సిట్ ఏర్పాటుకు సిద్ధం అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి ముందే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజలకు కమిషన్ నివేదిక.. కాళేశ్వరం లో జరిగిన నిర్ణయాలను వివరించాలని ఆలోచనతో ఉంది. దీని పైన ప్రస్తుతం జరుగుతున్న సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే సమయం లో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ తన ఫాం హౌస్ లో సమావేశమయ్యారు. కమిషన్ నివేదిక పైన కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని పేర్కొన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

**అరెస్ట్ కు ఛాన్స్...**
దీనికి కొనసాగింపుగా కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి సూచించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో చూద్దామని.. దానికి అనుగుణంగా కార్యాచరణ, భవిష్యత్ నిర్ణయాలు తీసుకుందామని పార్టీ నేతలకు కేసీఆర్ స్పష్టం చేసారు. దీంతో, ఇప్పుడు కేబినెట్ లో తీసుకునే నిర్ణయం రాజకీయంగా కీలక మలుపు గా మారే అవకాశం కనిపిస్తోంది.

# బీఆర్ఎస్‌కి బాలరాజు గుడ్ బై

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
అవినీతి ఆరోపణలు, వరుస విచారణలతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి తాజాగా మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన కీలక నేతలు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తమ రాజీనామా లేఖలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపించారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గువ్వల బాలరాజు రాజీనామా గులాబీ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. గువ్వల బాలరాజు రాజీనామా వెనుక ఉన్న కారణాలపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా.. చడిచప్పుడు చేయకుండా ఆయన పార్టీని వీడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు, మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణలతో గువ్వల బాలరాజు భేటీ అయిన తర్వాతే ఈ రాజీనామా నిర్ణయం వెలువడింది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఆయన ఈ నెల 9న బీజేపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో కష్టకాలంలో కీలక నాయకులు పార్టీని వీడటం ఆ పార్టీకి తీరని నష్టం చేకూర్చే అవకాశం ఉంది.

**అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం కూడా రాజీనామా..**
గువ్వల బాలరాజు బాటలోనే అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో అప్పటి నుంచి అబ్రహం పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు బదులుగా విజయుడికి అలంపూర్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతోనే అబ్రహం పార్టీతో సంబంధాలు తెంచుకుంటున్నారని అప్పట్లోనే ప్రచారం జరిగింది. అప్పట్లో కూడా అబ్రహం బీజేపీలో చేరబోతున్నారని పెద్ద ఎత్తున మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు గువ్వల బాలరాజుతో కలిసి రాజీనామా చేయడంతో, అబ్రహం కూడా కాషాయ తీర్థం పుచ్చుకోనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన గువ్వల బాలరాజు.. తన నిర్ణయం వెనుక ఉన్న మానసిక సంఘర్షణను రాజీనామా లేఖలో వెల్లడించారు. ఈ నిర్ణయం అంత సులువుగా తీసుకున్నది కాదని.. ఎంతో ఆలోచించి, ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే బాధతో పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాలరాజు తన లేఖలో.. గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని.. కేసీఆర్ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు దానిని వీడటం తనకు బాధగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తు కోసం ఈ కఠిన నిర్ణయం తప్పలేదని లేఖలో స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ అంతర్గత పరిస్థితి..**
అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీలో నాయకత్వ పరంగా కొంత గందరగోళం నెలకొంది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ క్రియాశీలకంగా లేకపోవడం.. కేటీఆర్, హరీష్‌రావుల మధ్య సమన్వయం లోపించడం వంటి అంశాలు పార్టీని బలహీనపరుస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఆపరేషన్ ఆకర్ష్' బీఆర్ఎస్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. చాలామంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అంతే కాకుండా.. పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగంగానే పార్టీ అధిష్టానంపై వ్యతిరేక రాగం పాడుతున్నారు. 'లిల్లీపుట్ నాయకులు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విబేధాలను స్పష్టం చేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు, భూముల వ్యవహారాలపై ప్రభుత్వం విచారణలు వేగవంతం చేయడం, కేసులు నమోదు చేయడం బీఆర్ఎస్ నాయకులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నాయకుల వలసలు, అంతర్గత కలహాలు, కేసుల భయంతో కార్యకర్తలు గందరగోళం. పార్టీ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో చాలామంది సైలెంట్ అయ్యారు. ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌ను ఒక క్లిష్ట పరిస్థితిలోకి నెట్టాయి.



## జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ అందించాలి

- అక్రిడిటేషన్ పై స్టిక్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జే.శ్రీనివాస్

**ఇబ్రహీం పట్నం, విశాలభారతి:**
జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ లను వెంటనే ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రంగా రెడ్డి జిల్లా కోశాధికారి జే.శ్రీనివాస్ ,ఇబ్రాహీం పట్నం డివిజన్ ప్రధాన పల్లాటి జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఎన్‌అర్ గార్డెన్ లో టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటి సమావేశం ప్రచార కమిటి కార్యదర్శి కందుకూరి నాగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు నూతన అక్రిడిటెషన్ కార్డులు ఇవ్వకుండా మూడు నెలలకొకసారి స్టికర్ వేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. స్టిక్కర్ విధానాన్ని రద్దు చేసి నూతన అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని,అంతేగాక గత నాలుగు సంవత్సరాల నుండి వివిధ పత్రిక సంస్థల్లో జర్నలిస్టులుగా పని చేస్తున్న వారికి కూడ నూతన అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటి ఉపాధ్యక్షులు గుండెమోని శివ కుమార్ , జబ్బురు కుమార్,పంది శ్రీనివాస్ ,సహాయ కార్యదర్శి ఎర్ర లింగం తదితరులు పాల్గొన్నారు.




## మహీంద్రా యూనివర్సిటీలో ఘనంగా స్నాతకోత్సవం

**కూకట్ పల్లి, విశాలభారతి:**
హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో నాలుగో వార్షిక స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బహదూర్‌పల్లిలోని క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 950 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఇందులో 13 మంది పీహెచ్‌డీ స్కాలర్‌లు కూడా ఉన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, విద్య విభాగాల నుంచి గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు ఈ డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ వేడుకలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ముఖ్యంగా, కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో శరత్ చంద్ర 10.0 సీజీపీఏతో, అలాగే ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సోడాదశి రాహుల్ 9.82 సీజీపీఏతో బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ ఏడాది ఎంబీఏ, ఎల్.ఎల్.బి, ఎం.ఏ, బీటెక్ నానోటెక్నాలజీ కోర్సులకు ఇది మొదటి స్నాతకోత్సవం కావడం విశేషం.ఈ కార్యక్రమానికి మహీంద్రా గ్రూప్ చైర్మన్, మహీంద్రా యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా అధ్యక్షత వహించాగా.. డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ కో-చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెక్ మహీంద్రా సీఈఓ ఎండీ మోహిత్ జోషి గౌరవ అతిథిగా విచ్చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యాజులు మెదురి, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ వేడుకలో పాల్గొన్నారు.




## ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
మండల పరిధిలోని పసుమముల రెవిన్యూ గ్రామ సర్వే నెంబర్ 386 లో పురాతన గుడిని కూల్చి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న వాటి మీద చర్యలు తీసుకోగలరు అని కోరుతూ,సోమవారం రోజు రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజావాణి లో ల్యాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి ఫిర్యాదు చెయ్యడం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే రంగా రెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్ మెట్ మండలం, పసుమాముల రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్-386 లో జిల్లా పరిషత్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు,1000 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి గత కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు అని ఆ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేకపోయిన ఇట్టి విషయం మీద గత కొంతకాలంగా వార్తాపత్రికలలో కథనాలు కూడా వచ్చాన కూడ తద్వారా అధికార దృష్టికి వెళ్లిన వాటి మీద ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని అన్నారు,ఆక్రమణకు గురైన ఈ భూమి యొక్క విలువ సుమారు ఐదు కోట్ల పైనే ఉంటది. గతంలో ఈ ప్రభుత్వ భూమిలో పురాతన దేవాలయం ఉండగా,ఆ గుడిని కూడా పూర్తిగా కూల్చివేసి కమర్షియల్ కట్టడాలను నిర్మిస్తున్నారు. గతంలో స్థానికుల ఫిర్యాదు మేరకు నామమాత్రంగా కూల్చివేతలు జరిగినా, మరల నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. కావున మా యందు దయ ఉంచి అట్టి నిర్మాణాల మీద చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని కాపాడగలరు. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద్, రాంబాబు, స్వామి, శ్రీ శైలం తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ లో గందరగోళం

**కీసర, విశాలభారతి:**
రైతులను రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుంటల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేసుకునే వారిని ఇక్కట్లకు గురి చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే కీసర మండలం రాంపల్లి దయారాకు చెందిన కందాడి శ్రీనివాస్ రెడ్డి తన అత్యవసర నిమిత్తం సర్వే నెంబర్ 577/ఇ లోని మూడు గుంటల వ్యవసాయ భూమిని విక్రయించాలని నిర్ణయించుకోగా, అజ్మీరా రాజు నాయక్ కొనుగోలు చేసేందుకు అంగీకరించాడు. దీంతో గత నెల 28న కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ ను కలిసి తాను మూడు గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్నాను, అట్టి భూమి రిజిస్ట్రేషన్ చేయగలరా..? అని అడిగారు. అందుకు తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తానని ఒప్పుకోగా, అదే రోజున మూడు గుంటల భూమి రిజిస్ట్రేషన్ స్లాట్ కోసం ఫీజును ఆన్ లైన్ లో చెల్లించాడు. ఈ నెల 31న స్లాట్ ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం కీసర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా, భూ భారతీ ఆపరేటర్ నరేందర్ చారి ఐదు గుంటల లోపు రిజిస్ట్రేషన్ చేయద్దని తహసీల్దార్ నుంచి ఆదేశాలు ఉన్నట్లు తెలియడంతో అజ్మీరా రాజు నాయక్ ఖంగు తిన్నాడు. తాను తహసీల్దార్ ను అడిగిన తర్వాతనే రిజిస్ట్రేషన్ కోసం ఆన్ లైన్ ఫీజు చెల్లించానని ,ఇప్పుడు కాదంటే ఏలా అని భూ భారతి ఆపరేటర్ తో రాజు నాయక్ వాగ్వివాదానికి దిగాడు. అయినా రాజు నాయక్ గోడును పట్టించుకోకపోవడంతో ఈ నెల 1వ తేదీన శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో నాలా ఫీజు కట్టి, శనివారం కీసర సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రూ. 90 వేల ఫీజు కట్టి గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం భూ భారతిలో కట్టిన ఛలాను ఫీజును తిరిగి ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. మండల రెవెన్యూ అధికారులు ముందుగానే సరైన సలహా ఇచ్చి ఉంటే తాను నష్టపోయే వాడిని కాదని అజ్మీరా రాజు నాయక్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. భూ భారతిలో ఫీజు ఏలా తీసుకుంటారు. రాజు నాయక్ రెండు,మూడు గుంటల్లో భూములను రిజిస్ట్రేషన్ చేయకుంటే భూ భారతిలో రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్ లైన్ ఏలా తీసుకుంటారని బాధితుడు అజ్మీరా రాజు నాయక్ ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ ను ముందుగానే అడిగి ఆన్ లైన్ లో ఫీజు చెల్లిస్తే.. తీరా రిజిస్ట్రేషన్ చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే.. ఆశోక్ కుమార్ ఐదు గుంటల లోపు వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేయరాదని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని కీసర తహసీల్దార్ ఆశోక్ కుమార్ తెలియజేశారు. ఫాంల్యాండ్ పేరిట రెండు,మూడు గుంటల భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని పేర్కొన్నారు.బాధితుడు రాజ్ నాయక్ కు భూ భారతిలో చెల్లించిన ఫీజును తిరిగి ఇప్పించేందుకు సహకారం అందిస్తానని తెలిపారు.





vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం
05.08.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



# అంగరంగ వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పసుమముల గ్రామం నందు అంగరంగ వైభవంగా బోనాల పండుగ సందర్భంగా పలహార బండి ఊరేగింపును యువ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, పలహారం బండి ఊరేగింపులో ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని సంఘ అధ్యక్షులు ముసరిగారి శివ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా చెట్టి నవీన్ గౌడ్ మాట్లాడుతూ... పసుమాముల గ్రామం నందు గత 25 సంవత్సరాలుగా పలహారం బండిని ఊరేగింపు ఎంతో అంగరంగ వైభవంగా గ్రామ పెద్దల సహకారం తో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెట్టి నవీన్ గౌడ్, చెట్టి రాము, శంకర్ మల్లేష్, చెట్టి శివ,చెట్టి రాజు గౌడ్, యువ చైతన్య సంఘం గ్రామ అధ్యక్షులు ముసరిగారి శివ గౌడ్, గ్రామ పెద్దలు కొత్తపల్లి జైపాల్ రెడ్డి,ఒకటవ వార్డ్ మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, వట్టి యాదయ్య గౌడ్, చర్లపల్లి శంకరయ్య, పొట్టి శంకరయ్య పెద్ద గౌడ్, శక్తి ప్రకాష్, కెసి రామచందర్, ముసరి గారి రాజు గౌడ్, నత్తి బాలకృష్ణ, నత్తి రామ్ సుందర్ గౌడ్, కేషి ప్రవీణ్, శంకర్ రమేషాతో పాటు గ్రామ పెద్దలు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లూనావత్ కృష్ణ నాయక్.. పేదల ఆశల చిగురు



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండలో జన్మించిన లూనావత్ కృష్ణ నాయక్, పేదల మధ్య నుంచి వచ్చినా పేదలకే అండగా నిలిచిన ప్రజానాయకుడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఈ యువకుడు బాల్యమునుంచి తండ్రికి పొలాల్లో సహాయం చేస్తూనే చదువులోనూ ప్రతిభ చూపాడు. ఇంటర్మీడియట్ వరకు చదివి, విద్యతో పాటు సమాజాన్ని మారుస్తూ రాజకీయ జీవితంలో అడుగుపెట్టాడు. పక్కనే ఉన్న పేదల ఇళ్లలో తాగునీటి కష్టాలు, వృద్ధులకు అందని పింఛన్లు, అనాథ బాలలకు మద్దతు లేని పరిస్థితులు ఆయన్ని బాధించాయి. ఈ నేపథ్యంలోనే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీకి చేరిన తర్వాత యూత్ నేతగా ఎదిగారు. ప్రజల సమస్యలపై పోరాటాలు చేశారు. మండల స్థాయిలో నాయకత్వం అందిస్తూ, తన గ్రామం కోసం ఎప్పుడూ అంకితభావంతో పనిచేశారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, మహిళల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ఆయన ప్రజలకు కలిసిరాని గొంతుగా నిలుస్తున్నాయని చాటిచెప్పింది. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశయం ఆయనలో దృఢమైంది. ప్రజల ఆశీర్వాదం కోరుకుంటూ, గ్రామ అభివృద్ధి కోసం ముందుకు సాగుతున్నారు. నూతన మద్దతు ధరల కేంద్రం, మహిళా సంఘాల ఏర్పాటు, యువతకు శిక్షణ శిబిరాలు, డిజిటల్ సేవల సమకూర్చడం వంటి ప్రణాళికలు ఆయన కలల్లో ఉన్నాయి. తన సేవలతో అనేక నాయకుల ప్రశంసలు అందుకున్నారు. పేదలకు, వృద్ధులకు, విద్యార్థులకు చేస్తున్న సేవలు కృష్ణ నాయక్‌ను "పేదల ఆశల ప్రతీక"గా తీర్చిదిద్దాయి.



# దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్ పూర్ గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ దేవాలయ నిర్మాణ పనులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి లతో కలిసి గుడి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగే గుడి నిర్మాణ పనులకు అవసరమైన నిధులను కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్ సోదరులు అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై ఉండి పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మాణం చేసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం తరఫున ఎమ్మెల్యే కి స్వాగతం పలికి శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మండల నరసింహ, ముదిరాజ్ సంఘం జనరల్ సెక్రెటరీ మాదరమోని రంగయ్య, ఆలయ ఉపాధ్యక్షులు పొన్నాల రవి, సంఘము ఉపాధ్యక్షులు గిరి, మాదరమోని యాదగిరి లతోపాటు 9 మంది డైరెక్టర్లు పాల్గొన్నారు.



# మొక్కలతోనే మానవ మనుగడ

**రాజేంద్రనగర్, విశాలభారతి:** మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని నార్సింగి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి హరి రతన్, సిబిఐటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ చంద్ర శేఖర్ పేర్కొన్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ హరి రతన్ అధ్యక్షతన సోమవారం గండిపేట లోని ఎం.జి.ఐ.టి కాలేజీలో వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరానికి ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చెట్లు లేకపోతే వాతావరణ సమతుల్యత దెబ్బతిని అతి వృష్టి, అనావృష్టి సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు, సిబిఐటి అధ్యాపకులు, విద్యార్థులు భారీ ఎత్తున మొక్కలు నాటారు. కార్యక్రమం లో డిఈఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, ఎన్సీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బాల్ రెడ్డి, ప్రొఫెసర్ చందర్ రావు, మున్సిపల్ సిబ్బంది, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాటి చెట్టుపై పడిన పిడుగు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా నర్సింగ్ మండలం ఖాజాగూడ లోని ల్యాంకో హిల్స్ సమీపంలో తాటి చెట్టుపై పిడుగు పడి చెట్టు పూర్తిగా కాలిపోవ డం జరిగింది అక్కడ ఉన్న స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు ఇప్పటివరకు హైదరాబాదులో పిడుగు పడిన దాఖలాలు లేవని అనేకమైన పెద్ద పెద్ద భవనాలు ఉండటం వలన వాటిపై పడితే పరిస్థితి ఏంది అని వాళ్ళు వాపోతున్నారు. అధికారులు మాత్రం వర్షం కురిసేటప్పుడు ప్రజలు చెట్ల కింద ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని వారు ప్రజలను కోరారు.


# అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన మంజూరు చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్మెట్ మండలం అనాజ్ పూర్,గుంతపల్లి,మజీద్ పూర్ గ్రామాలలో దాదాపు 80 లక్షలతో నిధులతో చేపట్ట తలచిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.కార్యక్రమంలో భాగంగా అనాజ్ పూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఏమ్మెల్యే తో పాటు రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి అమ్మవారికి వట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం హరిత హారం కార్యక్రమంలో అధికారులు, మహిళ సంఘాల సభ్యులతో కలసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామని అన్నారు. నియోజకవర్గంలో ని గ్రామాలలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు.


ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని...200 యూనిట్ల లోపు గృహా జ్యోతి అమలుపరుస్తూ...గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి,వైస్ చైర్మన్ సిహెచ్.భాస్కర చారి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్,మాజీ సర్పంచ్ ఆలయ ఫౌండర్ యెల్ల అలివేలు బాల్ రెడ్డి గ్రామపంచాయతీ సెక్రెటరీ సూరిబాబు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడిపై పోక్సో కేసు



**మేడిపల్లి, విశాలభారతి:** యువకుడిపై పోక్సో కేసు నమోదు అయిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పీఎస్ పరిధిలో నివసించే బాలిక వయసు 17 సంవత్సరాలు. తన చిన్నతనంలోనే తన తల్లి, బావకు పిల్లలు లేని కారణంగా బాలికను వారికి దత్తత ఇచ్చారు. అప్పటి నుంచి వారితోనే మేడిపల్లి లో పెరిగింది. పెంపుడు తల్లి సంవత్సరం క్రితం క్యాన్సర్ తో మరణించగా, అప్పటి నుంచి బాలిక చదువు మానేసి తండ్రి తోనే ఒంటరిగా నివసిస్తుంది. ఈ సందర్భంగా బాలికకు ఒక సంవత్సరం నుండి స్నాప్ చాట్ లో అలియాబాద్ నివాసితుడు పరిగె రవి తేజ (23) కు పరిచయం అయ్యాడు. నిందితుడు ఇదే అదునుగా చేసుకుని ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకున్నాడు. గత రెండు నెలలుగా నిందితుడు బాలిక ఇంట్లోనే నివసిస్తున్నాడు. విషయం తెలుసుకున్న తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్ కు తరలించామని మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి



- మొండి గౌరెల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించిన బీజేపీ నేతలు
- పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ,
- రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు మండల ఎన్నికల ప్రభారీ బోసుపల్లి ప్రతాప్

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని యాచారం మండల బీజేపీ మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ , రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు మండల ఎన్నికల ప్రభారీ బోసుపల్లి ప్రతాప్ అన్నారు. సోమవారం యాచారం మండలంలోని మొండి గౌరెల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన గ్రామం రేపటి మార్పు అనే అంశంపై ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి నరేష్, యెదల్లి సత్తయ్య , మేకల యాదగిరి రెడ్డి , రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ , నేతలు మల్లారెడ్డి , తాండ్ర రవీందర్ , గోగికర్ రమేష్,ఆంబోజి జగదీశ్ యాదవ్, కొండా మధుకర్ రెడ్డి, రాయకంటి విజయ్ కుమార్,నాయిని పాండు రంగారెడ్డి, పుప్పాల శాంతి కుమార్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు



# చెత్త కుప్పలో నెలలు నిండని శిశువు మృతదేహం

**రాజేంద్రనగర్, విశాలభారతి:** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అమానవియ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నెలలు నిండని శిశువు మృతదేహం మిరలం ట్యాంక్ ప్రాంతం కాలుతున్న చెత్త కుప్పలో స్థానికులకు కనిపించడం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీరాలం ట్యాంక్ ప్రాంతంలోని కాలుతున్న చెత్త కుప్పలో నెలలు నిండని శిశువు మృతదేహం ఆదివారం సాయంత్రం గమనించిన స్థానికులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందివ్వడంతో స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృత శిశువు నాలుగు నెలల వయసు ఉంటుందని ఎవరైనా పేదవారు ప్రభుత్వ హాస్పిటల్లో కానీ ఇక్కడ తీసుకువచ్చి పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

శిశువు మృతదేహం కనిపించడంతో సానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వం మంట కలిసిపోయిందని ఆందోళన చెందారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.



# పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,మాదపురం దుబ్బా తండాకు చెందిన లకావత్ యాదగిరి(డ్రైవర్) కాకతీయ యూనివర్సిటీ ఎన్ జిఓ అసోసియేషన్ ఉద్యోగి,కెయు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు 3రోజుల క్రితం పదవి విరమణ పొందగా నేడు కెయు అతిథి గృహంలో పదవి విరమణ పొందిన లకావత్ యాదగిరిని సాలువాతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి వర్యు లు ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాం రెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్,మాజీ సర్పంచ్ రాజన్న,యువజన నాయకుడు వంగ అర్జున్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు, యూత్, నాయకులు, పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సాయం సంతృప్తిగా ఉంది

క్లే పాట్ ఫౌండేషన్ చైర్ పర్సన్ ప్రియాంక



**రాజేంద్రనగర్, విశాల భారతి:** పేద విద్యార్థులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని క్లే పాట్ ఫౌండేషన్ చైర్పర్సన్ ప్రియాంక పేర్కొన్నారు. సోమవారం సర్కిల్ పరిధిలోని ఉప్పర్పల్లి ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు బ్యాగులు, మెడల్స్ పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్లే ఫౌండేషన్ బ్యాగులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయ మన్నారు. మున్ముందు ఇంకా మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా క్లే ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రియాంక తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ రాథోడ్, క్లే ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
05.08.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



## సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

**చౌటుప్పల్, విశాలభారతి:**
రైతులకు వ్యవసాయ పరికరాల పై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి ఎం.నాగరాజు ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12- పవర్ స్ప్రేయర్, 77- బ్యాటరీ స్ప్రేయర్,1 -ఎరువులు వేసే యంత్రాలు, 4- రోటావే టర్స్,4-ట్రాక్టర్ తో నడిచే డిస్కహారో, కల్టివేటర్,కేజీ వీల్స్,1-బండ్ ఫార్మర్, 1-బ్రష్ కట్టర్, 1-గడ్డి కట్టేయంత్రం, 1-పవర్ టిల్లర్, తదితర యంత్ర పరికరాలు కావలసిన రైతులు దరఖాస్తుతో పాటు భూమి పట్టాదారు పాస్ బుక్కుఆధార్ కార్డు జీరాక్సు కాఫీలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ట్రాక్టర్ పరికరాలు కావలసిన రైతులు ట్రాక్టర్ ఆర్సీ మరియు ఒక ఫోటో తో ఆగష్టు 05/8/2025 వతేదీ నుండి 14/8/2025 వరకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఎస్సీ,ఎస్టీ రైతులకి 50 శాతం మరియు ఓబీసీ లకు 40 శాతం సబ్సిడీ పై లభించును. లక్షకు పైగా సబ్సిడీ ఉన్న యంత్రాలను రైతు సంఘాలకు మాత్రమే కేటాయించడం జరిగిందని,వ్యక్తిగత రైతులకు ఇవ్వబడవని అయన తెలిపారు.

## ఆగని మట్టి తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు

- ప్రైవేట్ వెంచర్లకు విచ్చలవిడిగా తరలింపు
- రూ.లక్షలు గడిస్తున్న దళారులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- కందుకూరు మండలంలో యథేచ్ఛగా మట్టి దందా



**ఇబ్రహీంపట్నం, విశాల భారతి:**
రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. కందుకూరు మండలంలోనీ తిమ్మాపురం గ్రామంలో సర్వే నంబర్ 262/1 అసైన్డ్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి వేళల భారీ జేసీబీలతో మట్టిని తొలిచి లేలాండ్ వాహనాలతో మట్టిని అమ్ముకుంటూ లక్షలు గడిస్తున్నారు. అక్రమార్కులు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తుండడం వెనక ఆంతర్యం ఏంటని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. తిమ్మాపురం గ్రామంలో మట్టిని రాత్రి పూట లేలాండ్ వంటి బారి వాహనాలలో తరలించడం వల్ల శబ్దాలకు ఇబ్బంది అవుతుందనీ గ్రామస్థులు చెబుతున్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అదేపనిగా మట్టి దందా చేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనీ వినికిడి. గ్రామ శివారులో డంప్ చేసిన మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలనీ ప్రజలు కోరుతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి మట్టి తవ్వకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని , అధికారులు స్పందించి ప్రకృతి ప్రసాదించిన కొండలు, గుట్టలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## చెరువు భూమి కబ్జా చేస్తే ఊరుకునేది లేదు



**మునుగోడు, విశాలభారతి:**
చెరువులను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని మనుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు .395 ఎకరాలు ఉన్న మునుగోడు పెద్ద చెరువు అక్రమణకు గురైందని తెలుసుకున్న శాసనసభ్యులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులతో మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ మ్యాప్ ను పరిశీలించి రికార్డుల ప్రకారం చేపట్టాల్సిన పనులను అధికారులకు సూచించారు చెరువు భూమిని మొత్తం సర్వే చేసి కబ్జా చేసిన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు చెరువు హద్దులు వెంటనే నాటాలని సూచించారు చెరువు భూమి కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువు భూమిని నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తాసిల్దార్ నెలపట్ల నరేష్, ఎంపీడీవో విజయభాస్కర్, నీటిపారుదల శాఖ డి.ఈ ప్రేమ్ కుమార్, సర్వేయర్ నాగేశ్వరరావు, యువజన కాంగ్రెస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి,మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు,మాజీ యువజన కాంగ్రెస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి పందుల భాస్కర్,మాజీ సర్పంచ్ లు మిర్యాల వెంకన్న, జక్కలి శ్రీను యాదవ్ మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎండి అన్వర్ జిట్టగోని సైదులు తదితరులు పాల్గొన్నారు.



## క్లాత్ అసోసియేషన్ అధ్యక్షులుగా కర్నాటి శ్యాంప్రసాద్

**చౌటుప్పల్, విశాలభారతి:**
వట్టణ కేంద్రంలోని శ్రీ మత్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద చౌటుప్పల క్లాత్ %ు% రెడీమేడ్ అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా చంద్రయ్య అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా కర్నాటి శ్యాంప్రసాద్, కార్యదర్శిగా సుంక్కి గణేష్, కోశాధికారిగా మసరం యాదగిరి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కర్నాటి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ. చౌటుప్పల్ లో కరోనా తరువాత వ్యాపారంలో సమతుల్యత లోపించి చిరు వ్యాపారులు వ్యాపారం చేయలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.
చేనేత,క్లాత్ అండ్ రెడీమేడ్ వస్త్రాలపై ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి జిఎస్టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ లోని వస్త్ర వ్యాపారుడు ఎదురుకుంటున్న సమస్యలపై అడగడానికి ముందుంటానని అన్నారు. వస్త్ర వ్యాపారులు ఎంతో నమ్మకం తోటి నన్ను అధ్యక్షునిగా ఎందుకున్నందుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.
నూతన ఉపాధ్యక్షులుగా. వులిపాటి చిరంజీవి,సహాయ కార్యదర్శిగా పున్న రామకృష్ణ, గౌరవ సభ్యులుగా. బాష్పాల జగదీష్,గంజి రవి, రావుల వంుత్యాలు, గౌరవ సలహాదారులుగా,గోశిక స్వామి, తడక నరసింహ,పున్న సత్యనారాయణ,పిల్లల మరి అశోక్,జిల్లా బిక్షం,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.
ఈ సమావేశంలో వస్త్ర వ్యాపారులు, లగ్గోని శ్రీనివాస్,ఉప్పల లింగస్వామి,గోశిక కరుణాకర్, గోశిక పాండు,దేవులపల్లి గణేష్, జిల్లా శంకర్,పుట్ట బత్తిని రవి,లోక విష్ణు,దొంత మల్లేష్,ఇమ్మడి కిషోర్,ములుగు లక్ష్మయ్య,ఉబ్బు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

- ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని భద్రాచలం ఐటిడిఏ లో ఫిర్యాదు
- మణుగూరు అడ్వకేట్ సామాజిక కార్యకర్త కర్నె రవి

**మణుగూరు, విశాలభారతి :**
మండలంలోని గిరిజన పిల్లలకు ఆధార్ లేక విద్యావకాశాలు దూరం అవుతున్నాయని, తక్షణమే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, మండలంలోని పలువురు గిరిజన గ్రామాలలో జీవిస్తున్న పిల్లలకు ఆధార్ కార్డులే లేవన్న కారణంతో విద్యా వ్యవస్థ నుండి దూరంగా పడిపోతున్న పరిస్థితిని గమనించిన సామాజిక కార్యకర్త కర్నే రవి సోమవారం నాడు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బుగ్గ, ఖమ్మం తొగు, బుడుగు, రేగులగండి, పెద్దపల్లి, ఇప్పలగుంపు, వైఎస్ఆర్ నగర్ మరియు పరిసర గిరిజన గ్రామాలలో ఉన్న చిన్నారులకు పుట్టిన సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్ నమోదు జరగలేదు. దీనివల్ల వారు పాఠశాలల్లో చేర్పు కావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్య, ప్రభుత్వ పథకాలు, గుర్తింపు అనేవి ఆధార్ లేకుండా వారికి అందడం లేదన్నారు.
గిరిజన తల్లిదండ్రులలో అక్షరాస్యత లేని స్థితి, దూర ప్రాంతాలలో ఆధార్ కేంద్రాల లభ్యత లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు వీరిని మరింత వెనక్కి నెట్టుతున్నాయన్నారు.
ఈ నేపథ్యంలో, ఆయా గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు మరియు నవీకరణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, పుట్టిన సర్టిఫికెట్ లేని చిన్నారులకు యుఐడిఏఐ నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ ధృవీకరణ పద్ధతులను అనుమతిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కర్నే రవి ప్రాజెక్ట్ అధికారిని అభ్యర్థించారు. ఈ శిబిరాల ద్వారా గిరిజన చిన్నారులకు విద్యావకాశాలు మళ్ళీ లభించడంతో పాటు, వారి జీవితంలో నూతన ఆశలు చిగురించనున్నాయని ఆయన తెలిపారు.



## ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

- ప్రజావాణికి 82 ఫిర్యాదులు
- ప్రజావాణి కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**
ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. హాస్టల్స్ , పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోటు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- మాల్ గ్రామపంచాయతీ నల్లవెల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 567,531 లో భూకబ్జా
- అప్పటి అధికారులు ఇంటి నంబర్లు ఇచ్చారనీ ప్రజావాణిలో ఫిర్యాదు
- భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**
ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భూముల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. యాచారం మండలంలోని మాల్ గ్రామపంచాయతీ నల్లవెల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 567,531 లో ప్రభుత్వ భూమిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేసినారని , ఆ భూమిలో అక్రమంగా ఇంటి నెంబర్లని అధికారులతో సృష్టించుకుని డాక్యుమెంట్లు తయారు చేసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకొని లావాదేవీలు జరుపుతున్నారన్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నామ మాత్రం గానే చూసి చూడనట్లు వ్యవహరించారని అన్నారు. కబ్జా చేసిన వారిపై చర్యలు ఇంతవరకు తీసుకోలేదని,పలు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ స్పందన లేదని,ఇప్పటికైనా కబ్జా కు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించి సర్వే చేసి హద్దులు నియమించి పిఓటి చట్టం కింద భూమిని స్వాధీనపరచుకొని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి లో పేర్కొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.